# శ్రీ హరిణి శతకము




రచయిత్రి

చొప్పకట్ల హరిణి

## సర్వ హక్కులు రచయిత్రివి

**harini.choppakatla@gmail.com**

ముఖ చిత్రం
శ్రీ బాపు గారు చిత్రించిన "వర లక్ష్మి" అమ్మవారు
వారి కుటుంబ సభ్యుల అనుమతితో

**https://bapuartcollection.com**

# <u>అంకితం</u>

## మాతృ దేవో భవ
## పితృ దేవో భవ



శ్రీ దుద్యాల నారాయణ మూర్తి - ఇందిర

ఆ. అంకితమ్ము సేతునమ్మకున్ నాన్నకున్
జన్మనిచ్చి బ్రతుకు శక్తినిచ్చి |
మంచి చెడులు నేర్పి మమతఁగాచిన వారి
పాదపద్మములకు ప్రణతులిడెద ||




# శ్రీ గురుభ్యోనమః



అవధాన శారదామూర్తి, ప్రఖ్యాత ఆస్ట్రేలియా అవధాని

**శ్రీ తటవర్తి శ్రీ కల్యాణ చక్రవర్తి గారు**

"పద్యపక్ష మందు పద్యరచన నైతే నేర్చితి కాని ఇటుపై ఈ బాటలో పయనమెలా సాగించాలి అని సంశయమున ఊగిసలాడుతున్న నాకు ప్రతి నిమిషము స్ఫూర్తిదాయకముగా నిలిచి, నిరంతర సహాయ సహకారాలందిన మా గురువులు శ్రీ తటవర్తి కళ్యాణ చక్రవర్తి గారి పాద పద్మములకు నమః స్సుమాంజలుల నర్పిస్తూ కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను. పద్య రచన అత్యంత సులభ తరముగా నేర్పించి ప్రతి తెలుగింట పద్య జ్యోతి వెలుగింప ప్రయత్న మొనరిస్తున్న వారి సత్సంకల్పం ఆ శారదాంబ నెరవేర్చాలని ఆశిస్తున్నాను"

# ముందు మాట...

హరిణి... మన హరిణి... చొప్పకట్ల (దుద్యాల) హరిణి శతకం రాసిందట. ఆశ్చర్యపోయాను. నా చేత్తో పట్టుకుని చూసి ఒకసారి గిల్లుకొని చూస్తే చురుక్కుమన్నప్పుడు నిజమే అనిపించింది. చదివాను. ఈసారి చాలా ఆశ్చర్యపోయాను. రాసినందుకు కాదు, ఇంత బాగా రాసినందుకు. పెద్దవాళ్ళు పిల్లలని పొగడ కూడదంటారు. కాని తప్పటం లేదు. వృత్తిరీత్యా శిక్షణా సంస్థలో ప్రధానాచార్యుడిగా పని చేస్తున్నప్పుడు ఎవరైనా మంచిపని చేస్తే ఆనందం అనిపించేది. ఇప్పుడు హరిణి ఇంతమంచి పని చేస్తే ఆనందంతో మాటలు రావడం లేదు.

వచనం రాయటమే కష్టం, పద్యాలు రాయటం ఇంకా కష్టం. అందులో శతకం రాయడం ఎంతో కష్టం. అది సాధించింది హరిణి అంటే చాలా సంతోషంగా ఉంది.

ఒక చిన్నపిల్ల (మాకు తను ఎప్పుడూ చిన్నదే) నిజంగా చక్కని పదజాలంతో ప్రాసతో వందకు మించి పద్యాలు రాయడం అన్నది, అది మొదటి ప్రయత్నంలోనే అన్న విషయం సాహిత్య అభిమానులు అందరూ హర్షించ వలసిన విషయము.

ఒక అమ్మాయి నవ్యనూతనంగా (కొత్తగా) చేస్తున్న ప్రయత్నంలో ఆమె పేనా నుండి అలవోకగా సెలయేరులా ప్రవహించిన అక్షరాలు, పదాలు, పద్యంగా కవనంగా మారిన నేపథ్యంలో 'నవ్య కవన సరణి నడుచు హరిణి' అన్న మకుటం చాలా భావగర్భితంగా ఉందనాలి.

పద్యం రాయడానికి అందులో ప్రాసబద్ధంగా వ్రాయడానికి చాలా పదజాలం కావాలి. ఈ కాలం పిల్లలకి తెలుగు రాయడమే కాదు, మాట్లాడటం కూడా రాదు అని అనుకునే వాళ్ళకు, మన సంప్రదాయాలు, ఆచారాలు, సాహిత్యం నాశనం అయిపోతున్నాయి అని వాపోయే పెద్దలకి (కారణం లేకుండా ఏం కాదులెండి) ఇది సమాధానమా? అనిపిస్తోంది. ఇంకా తెలుగు భాషపైన మక్కువ ఉన్నవాళ్ళు, తెలుగుకై ప్రయాస పడేవాళ్ళు ఉన్నారని నిరూపించింది హరిణి.

ఇక పద్యాలలోని విషయాలను పరిశీలిస్తే విఘ్నేశ్వరుని స్తుతితో ప్రారంభించి, దేవుడ్ని తలుచుకొని గురువులకు నమస్కారం చేసి మొదలు పెట్టింది. “ఎంత కష్టమైనా ఎదురీత కొట్టరా” అని ప్రోత్సహిస్తూ, విద్య కాక లేదు భూషణమ్ము అని చెబుతూ 'పచ్చదనం పెంచి ఇంతుకరా సూరేళ్ళు' అని ఉద్బోదిస్తూ.... 'కపట బుద్ధి వలన కలిసిరాదు' అని కోప్పడుతూ, 'నేటి జనుల వరుస నెరిగి నడుచుము' అని సలహా యిస్తూ, అలాగే 'బంధంలో చిక్కుకుని పరం మరువకు' అని తత్వం

చెబుతూ, 'కాలమొచ్చి నప్పుడు కాదేదీ కష్టము' అని ధైర్యం చెబుతూ, 'కన్నవారే మనకు కనిపించు దైవాలు' అని జీవిత సత్యం చెబుతుంది. అలాగే "చేయు పుణ్యాలే చేబట్టి పోయేవు" అని, "కన్నవారి ప్రేమ కరిగిపోనిదిరా" అనీ దైవం "పలుకు తానంతట భక్తికోటి విలువ", మనం చేసే మంచి "వెంట వచ్చునెపుడు వెన్నంటి మనతోటి", భాష గురించి చెబుతూ "మాతృభాషనెప్పుడు మాతృమూర్తిగా చూడు", ఇంటర్నెట్లో గూగుల్ గురించి చెబుతూ "ఆక్రమించేను తాను అనుభవజ్ఞుల దర్జా". ఈవిధంగా మన జీవితాలలో ఎదురయ్యే ఎన్నో వైవిద్యభరితమైన విషయాలు యీ శతకంలో చోటు చేసుకున్నాయి.

ఒకవిధంగా అనవసరపు విషయాల బరువులో క్రుంగి, డస్సి, అలిసి, కూలబడిపోయిన

సమాజాన్ని (తాను చదివింది ఫిజియో థెరపి గనుక) కొంత లాలించి, కొంత ప్రోత్సహించి, సున్నితంగా చెంపదెబ్బ వేసి కొండొకసారి ఒక గుద్దు గుద్ది సరిచేసే ప్రయత్నం చేసిందా హరిణి ఈ శతకం ద్వారా అనిపించింది.

మొత్తానికి ఈ శతకం చదువుతుంటే సాహితీ చరిత్ర పొత్తంలో శతక విభాగంలో హరిణి కూడా శాశ్వితంగా తన పేరు నమోదు చేసుకున్నదనిపించింది.

ఈ చిరంజీవి ఇంతటితో ఆగిపోక ఇలాగే సాహితీ సేవ చేస్తూ, సరస్వతీదేవి దీవెనలతో, చిరకాలం యిలాగే అందరికి ఆనందం పంచాలని ఆ పరమేశ్వరుడ్ని కోరుకుంటూ....



జమ్మలమడక శశిమోహన్
+91 93911 38455

# తొలిపలుకు.

శతక రచయిత్రి చి:సౌ: హరిణి మాకు దగ్గరి బంధువు. మా సోదరుని మనుమని భార్య మాకు మనుమరాలు. వృత్తిరీత్యా వైద్యురాలైనా ప్రవృత్తిరీత్యా  కవనముపట్ల నాకర్షితురాలు. కేవలము ఊహలలోనే జీవింపక హరిణి కలము సారించి "శతకరచన" చేయుట ముదావహము. ఈకారణంగా నన్ను తొలిపలుకులు వ్రాయగోరుటం మిక్కిలి సంతోషదాయకము. ఆటవెలదులతో దగించిన ఈశతకమును చి;సౌ; హరిణి వారి తలితండ్రులకంకిత మొసంగుట కొనియాడ దగియున్నది.

సమయాభావమువలన ఏదో స్థాలీపులాకన్యాయముగా నీశతకమును పరిశీలించి తోచిన రెండుమాటలను ముందు మాటలుగా మీముందుంచుచున్నాడను సహృదయులు చిత్తగింతురు గాక!

"సుకవితాయద్యస్తి రాజ్యేనకిమ్"- అన్నాడు భర్తృహరి. "కవితయున్న చాలు- రాజ్యమేల?" -అంటే రాజభోగములన్నీ కవికి సులభముగా లభించునని దీని భావము. ఆరాజులుగాని, ఆకవన వైభవములుగాని నేడు మృగ్యము సహృదయులతోడ్పాటు తోడనే నేడు కవులకు కవితకు పుష్టియు తుష్టియు కలుగుచున్నవనుట యదార్థము.

నన్నయ యాదిగా నేటివరకు విస్తరించిన ఈసువిశాల ఆంధ్రసాహిత్యమున "శతకమొక విశిష్టరచన. ఇది లఘుకృతి కేవలము నూటయెనుబది పద్యములకే యిది పరిమితము. అల్పాక్షరములలో అనల్పార్థఘటనకు గాను శివకవులీ రచనను తొలుత ప్రారంభించినారు. ప్రబోధాత్మకమై యిది రానురాను బహుముఖముల విస్తరించినది. మాచిన్నట సుమతి, వేమన శతక పఠనముతోనే విద్యాభ్యాసము ప్రారంభమయ్యేడిది. సుమతి తన రచనకు కందము నాశ్రయింపగా, వేమన తనకిష్టమైన ఆటవెలది నుపాశ్రయించినాడు. రానురాను తామరతంపరగా నీశతకములు విస్తరించి ఆంధ్రభాషకు అలంకార భాజనములైనవి.

అంతప్రాముఖ్యమును చూరగొన్న ఈప్రక్రియలో నవీన కవయిత్రి చి:సౌ హరిణి ప్రబోధాత్మకమైన శతకమును వ్రాయగలిగినందుకు ఆమెకు అభినందనలు.

అలం విస్తరేణ-

ఇంకవిషయమునకు వత్తునుగాక! 108 ఆట వెలదులలో సాగిన ఈ హరిణీశతకము చక్కని నుడులతో నిండిన ప్రబోధాత్మకమైనకృతి. సాంఘిక, నైతిక, పారమార్థిక, పౌరాణిక, విషయములకు నైలవై ఈశతకము చదువరులకు ముచ్చటగొల్పుననుట యదార్థము.

మచ్చుకు కొన్నిపద్యములు.

"విద్యవలన గలుగు విజ్ఞాన మెంతయో
విజయ పథము జూపు విబుధ తతికి
విశ్వ మందు జూపు విఖ్యాతిగానిన్ను
నవన కవన సరణి నడచు హరిణి!!

పైపద్యము "విద్యానామనరస్యరూపమధిరమ్మ"ను భర్తృహరి భావనకు సూక్ష్మరూపమేగదా!

"కోపమందునీవుకోల్పోయెదవుబుద్ధి
మనసు నొచ్చుకొనెడు మాట లనుచు
యుక్తితోడసాగ నుపకారివయ్యేవు

"కోపము తపముంజెరచును"-భారతకథ కౌశికోపాఖ్యానము. కోపం వలన కలిగే అనర్థాలను సూచించి దానికి దూరంగా ఉండమంటోంది. దానికిది యనుకృతి.

"అందచందమెపుడునలరించుజనులను
మనసు జూడ బోరు మనుజు లెవరు
అందమైనహృదయమలరించుకోమరి,

దేహసౌందర్యంబాహ్యం.అశాశ్వతం. హృదయ సౌందర్యం శాశ్వతం శాంతి దాయకం. దాని కోసం ప్రయత్నించాలని ప్రబోధం.

"బాధపెట్టబోకు బాధ్యత నెరుగక
తల్లి తండ్రి మనసు తల్లడిల్లు
కనగ వారు మనకుకనిపించుదైవాలు.

బాధ్యత వీడిచెరించే యువతకు కిది వీపు మీద చురక! నిజమే! తలితండ్రులు ప్రత్యక్షదైవాలే ! వారి ఆలనపాలనలను మరువరాదని యువతకు ప్రబోధం. .

శారద దయజూప కవన వైభవ మబ్బె
పద్య పంట విరిసె పసిడి వోలె
కావ్యశోభ లలరె కాంతులీనుచునేడు

నిజమే! యిది శారద కృపయే! లేకున్న నిట్టి కృతి ఈసు కృతి

రచియింపగలదా? మ్మాటికిది నిజము. పద్యములన్నియు బంగరుతునకలే! అనవద్యములే! హృద్యములే! భావన లన్నియు పంచదారగుళికలే! సహృదయులైన సారస్వత సమారాధకులీ శతకమును సమాదరించి రచయిత్రిని ప్రోత్సహింతురు గాక! ఇట్టి సుకవితాకుమారికి జన్మమొసంగిన తలిదండ్రులను, చేపట్టిన మాచిరంజీవిని అభినందించుచు, అమ్మా! హరిణీ! ఇట్టి సత్కృతులను మరిన్ని రచియించి శారద నలంకరించి చిరయశస్విని వగుదువుగాక!

అభ్యుదయోస్తు! అని ఆశీర్వదించుచు.

స్వస్తి



"సుకవితావిశారద"

ఆచార్య చొప్పకట్ల సత్యనారాయణ
డి.డి.కాలనీ, హైదరాబాద్ 500007

# కృతజ్ఞతలు

శ్రీ హరిణి శతకము రూపు దిద్దుకొనుట లో ప్రధాన పాత్ర వహించారు మా పిన్ని శ్రీ రమాదేవి గారు. తెలుగు సాహిత్య సమూహము నందు వచ్చిన పద్యపక్షము యొక్క సందేశమును చూపించి నన్ను పద్యరచనకు ప్రోత్సహించిన తనకు పాదాభి వందనములు చేస్తూ నా కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాను.

నేను పద్యరచన చేయగలనా. అని సంశయమున డోలాయమాన స్థితిలో వున్నప్పుడు మీకు తెలుగు వ్రాయటం, చదవడం వస్తే చాలునండి మా మా గురువుగారు మీతో పద్యం వ్రాయించగలరు, పద్య పక్ష సమూహంలో చేరండి అని ప్రోత్సహించిన శ్రీ శ్రీనివాస రవికాంత్ గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు |

గురువు సహాయ సహకారాలతో, ఆ జగన్మాత కృపాకటాక్షములతో శ్రీహరిణి శతకము రూపుదిద్దుకున్నది.

ముందుమాట వ్రాసి పెడతారా అని మా బాబాయి శ్రీ శశిమోహన్ గారిని అడగడమే ఆలస్యం అన్నట్టుగా ఎంతో ఆనందంగా ముందుకు వచ్చి తన అమృత తుల్యమైన పదజాలముతో ఈ శతకమునకు ముందుమాట వ్రాసి నందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను..

మాకు తాతగారైన సుకవితా విశారద శ్రీ చొప్పకట్ల సత్యనారాయణ గారు నా శతకము ను పఠనము జేసి అమృతతుల్యమైన వారి పదజాలముతో నా శతకమునకు తొలిపలుకు వ్రాసి నన్ను ఆశీర్వదించారు.వారి పాద పద్మ ములకు వినమ్ర నమస్కారములతో నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేసు కుంటున్నాను

గురుకులము లో పెద్ద వారందరికీ నా నమః స్సుమాంజలుల నర్పిస్తున్నాను.దీక్షితులు గారు వారి విలువైన సమయమును వెచ్చించి పద్యములలో సవరణలు తెలిపి నా ఈ పయనము లో చేసిన సహాయమునకు వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేసుకుంటున్నాను



# శ్రీ హరిణి శతకము

## ఆటవెలది

పద్య లక్షణములు:

1. **4** పాదములు ఉండును.
2. ప్రాస నియమం **లేదు**
3. ప్రతి పాదమునందు **4** వ గణము యొక్క మొదటి అక్షరము యతి స్థానము
4. ఒకటవ పాదమునందు **మూడు సూర్య , రెండు ఇంద్ర** గణములుండును.
5. రెండవ పాదమునందు **ఐదు సూర్య** గణములుండును.
6. మూడవ పాదమునందు **మూడు సూర్య , రెండు ఇంద్ర** గణములుండును.
7. నాలుగవ పాదమునందు **ఐదు సూర్య** గణములుండును.

శ్రీగణేశ దేవ సిద్ధి బుద్ధి నొసగు
తొలుత పూజ చేసి తలుతు నిన్ను
విఘ్న ములను బాపి విజయము నిడుమయ్య
నవ్య కవన సరణి నడుచు హరిణి

## గణ విభజన

| | | | | | |
|---|---|---|---|---|---|
| ✓ | సూర్య<br>U \|<br>శ్రీ గ | సూర్య<br>U \|<br>ణే శ | సూర్య<br>U \|<br>దే వ | ఇంద్ర<br>U \| U<br>సి ద్ధి బు | ఇంద్ర<br>\| \| \| \|<br>ద్ధి నొ స గు |
| ✓ | సూర్య<br>\| \| \|<br>తొ లు త | సూర్య<br>U \|<br>పూ జ | సూర్య<br>U \|<br>చే సి | సూర్య<br>\| \| \|<br>త లు తు | సూర్య<br>U \|<br>ని న్ను |
| ✓ | సూర్య<br>U \|<br>వి ఘ్న | సూర్య<br>\| \| \|<br>ము ల ను | సూర్య<br>U \|<br>బా పి | ఇంద్ర<br>\| \| \| \|<br>వి జ య ము | ఇంద్ర<br>\| \| U \|<br>ని డు మ య్య |
| ✓ | సూర్య<br>U \|<br>న వ్య | సూర్య<br>\| \| \|<br>క వ న | సూర్య<br>\| \| \|<br>స ర ణి | సూర్య<br>\| \| \|<br>న డు చు | సూర్య<br>\| \| \|<br>హ రి ణి |

|| ఓం ||

1. శ్రీ గణేశ దేవ సిద్ధి బుద్ధి నొసగు
తొలుత పూజ చేసి తలుతు నిన్ను |
విఘ్న ములను బాపి విజయము నిడుమయ్య
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

2. శ్రీనివాస నేను శ్రీకారము చుడితి
పద్య రచన జేయ పథము చూపు |
అభయ మిడుము నాకు ఆశ్రిత వత్సలా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

3. పాటు పడిరి గురువు ప్రాసలు నేర్పిరి
యతులు తెలుప మనకు యజము జేసె |
సాధనమున కుదురు సాటి లేని పద్యము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

4. తిరిగె మలుపు బ్రతుకు తీయగా మారినది
మంచి జ్ఞాన మీడె మనకు గురువు |
పద్య కాంతి నింపె పక్షమున మనలోన
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

5. ఎంత కష్ట మైన ఎదురీత కొట్టరా
ధర్మ పథము విడకు ధరణి యందు |
నీ స్వధర్మ మనిన నినుఁ గాచు దైవమ్ము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

6. పచ్చి చిగురు తినగ పాడెను కోయిల
వినగ యతులు ప్రాస విధులు తెలిసె |
మధుర పద్య మలరె మత్త కోకిల లోన
నవ్య కవన సరణిc నడుచు హరిణి ||

7. రమణ రమణ యనుచు రాఘువుని తలుప
కనుల విందు చేసె కలికి రూపు |
స్వామి సేవ చేసి సార్థక మయ్యెద
నవ్య కవన సరణిc నడుచు హరిణి ||

8. దివ్య దీప్తి వచ్చి దిక్కును చూపించె
భవ్య భవిత దిద్దె భాగ్య లక్ష్మి |
పదము రాని నేను పద్యము వ్రాసితి
నవ్య కవన సరణిc నడుచు హరిణి ||

9. పద్మ కరుణ జూప పద్యము పొంగెను
పద్య మాల వ్రాసి ఫలము నొంది |
అమ్మ కరుణ తోడ అవనిలో అమరమై
నవ్య కవన సరణిc నడుచు హరిణి ||

10. ఇహము దైవ మాయ ఇదియే యథార్థము
నిజము నెరిగి సాగు నిరతి తోడ|
పరమ పథము పట్టి పరమాత్మ జేరుమా
నవ్య కవన సరణిc నడుచు హరిణి ||

11. దొరల బ్రతుకు పొంద దోహద పడునన్న
చోర భయము లేని హారమైన |
విద్య గాక లేదు వేరు భూషణ మిక
నవ్య కవన సరణి నడుచు హరిణి ||

12. తరువు లిచ్చు మనకు తరగని వరములు
మనిషి మరిచె వాని మనసు లేక |
వనము లేక మనిషి వాఁపోవు నొకరోజు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

13. వాణి కృపను జూప వాక్ సిద్ధులను బొంది
పలుకనేని తాను మాట నేర్చె |
శ్యామ పుత్రుడగుచు సత్యవ్రతుడు సాగె
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

*దేవి భాగవతము లోని కథ ఆధారముగా వ్రాసిన పద్యము*

14. చెట్టు నీడ నిచ్చి చెలిమిని పంచును
మాతృ మూర్తి వోలె మమత నిడును |
పచ్చదనము పెంచి బ్రతుకుమా నూరేళ్లు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

15. పరమ భాగవతులు పయనించు పథమున
పయన మగుచు కఠిన పట్టు తోడ |
భవ్య భజన చేసి పరమేశు జేరెద
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

16. అస్త్ర విద్య నేర్పె అక్షర శరముతో
గురువుగారు మాకు గురిని చూపి |
పద్య ములను వ్రాసి ప్రతిభను చూపగ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

17. కల్ల జెప్పి నీవు కలిసి మెలిసి యున్న
కపట బుద్ధి వలన కలిమి రాదు |
మనుషు లెరగ కున్న మాధవు డెరుగడా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

18. ప్రోది యొక్కపథము పుస్తకములు జూపు
జ్ఞాన మిచ్చి నిన్ను జ్ఞాత జేయు |
వాక్కు విలువ పెరుగు వాగ్దేవి కరుణతో
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

19. ఇంద్రియమ్ము లొసఁగు నింపైన సుఖములు
దరికిఁ జేర నీవు ధర్మ చింత |
మోహములను వీడి మోక్షమ్ము నొందుమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

20. విద్య వలన కలుగు విజ్ఞాన మెంతయో
విజయ పథము చూపు విబుధ తతికి |
విశ్వ మందు నిలుపు విఖ్యాతగా నిన్ను
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

21. స్వార్థము విడి నీవు సాయము నేర్చుమా
తోటి వారి కెపుడు తోడు గుండ |
ధరణి లోన నీవు దైవమై నిలిచేవు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

22. ఒంటి గానె వచ్చి యొంటిగా పోదుము
మోస పోకు నీవు మోహ మందు |
తిప్ప పాటు లోన చెప్పక వెడలేము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

23. ధనము చెంత నున్న దండిగా వత్తురు
కష్ట మున్న వేళ కలిసి రారు |
నేటి జనుల వరుస నెరిగి నడుచు మోయి
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

24. అతులిత బలధామ! ఆంజనేయ! అనుచు
హనుమ సేవ జేతు హాయి గాను |
రామ దూత కొలువు రామ రక్ష నిడును
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

25. కష్ట మనుచు నీవు గమ్యము వీడిన
కర్మ ఫలము రాదు కలిమి నొసగ |
అడ్డములను దాటి ఆశయమును జేరు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

26. వింత సరణి నాడు విధి రాత మనతోడ
వివిధ మోహము లను విసురు వలలు |
బంధనముల జిక్కి పరమును మరువకు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

27. ఆడ పిల్ల లొసగు నానంద మెంతయో
ఆదరమున గనెడి అమ్మ వోలె |
అతివ లేని దైన అవనియే లేదయా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

28. కోప మందు నీవు కోల్పోయెదవు బుద్ధి
మనసు నొచ్చు కొనెడి మాటలనుచు |
యుక్తి తోడ సాగ యుపకారి వయ్యేవు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

29. చిత్ర మందు కాదు చిత్త మందున చూడు
చిద్వి లాస రూపు సిద్ధి పొంద |
మనసు నందు నిలుచు మాధవు డెల్లడ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

30. మెచ్చు కొనగ నిన్ను మైమరపు కలుగు
నింద పడగ మనసు నీర సించు |
పనియె ముఖ్యమనిన బ్రతుకుయే స్వర్గంభు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

31. సంతసమున నీవు జన్మము సాగించు
బరువు వేయ బోకు బ్రతుకు పైన ।
వ్రాసి పెట్టి యున్న రాక మానదు సుమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

32. చింత కాల్చి వేయు చితి లేక పోయినన్
బాధ పడిన బ్రతుకు బాగు పడదు ।
కాల మొచ్చి నపుడు కాదేది కష్టమ్ము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

33. చేత నున్న పనిని చేజార బోనీకు
పూను కున్న పనులు పూర్తి కాక ।
పట్టి విడుచు చున్న ఫలితము రాదయా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

34. కలత వలదు నీకు కష్ట సమయ మందు
చింత లుండ బోవు చిరముగాను ।
కష్ట సుఖము లెపుడు కలకాల ముండవు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

35. హరిని జూచినేను హరిహరి యనుచును
మనసు లోనిలిపితి మాధవుడను ।
జన్మ సార్ధకమ్ము చక్రి దర్శనమ్ము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

36. కవన విద్య నిడుచు కవయిత్రి చేసెను
కనక దుర్గ నన్ను కరుణ చూపి |
కవిత రాసి నేను ఘన నుతుల్ జేసెద
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

37. బాధ పెట్ట బోకు పరుల మనసు నీవు
తెలియకుండ కాని తెలిసి గాని |
మమత పంచి చూడు మాధవుడయ్యేవు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

38. తలచి చూడు నీవు తలుపులమ్మ నెపుడు
తలచి నంత పలుకు తల్లి ఎపుడు |
తపము జేసి నీవు తరియించు మిత్రమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

39. వేంకట గిరి నాథ వేడ్క తోడ భజింతు
మనసు నందు నిలిపి మదుర మూర్తి |
కామితమలు దీర్చు కలియుగ దైవమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

40. బాహ్య సుఖము కూడ భాధయే పంచును
మనసు నందు తృప్తి మనగ లేక |
వెతకి జూడ బయట వెలితియే మిగులును
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

41. జయము నారసింహ జయము జనార్ధనా
మంగళముగ నిన్ను మదిన నిలిపి |
భజన సేతు తండ్రి పావన నామము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

42. జగమునెల్ల నడుపు జ్వాలయై వెలుగుచూ
పాపహరము జేయు పరమ శక్తి |
కావు మమ్మ మమ్ము కామాక్షివైనీవు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

43. ఆంజనేయ నీకు అంజలి నొసగెద
అష్ట సిద్ధు లిచ్చి ఆదు కొనుమ |
చరణ సేవ జేసి చరితార్ధమయ్యేద
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

44. రామ రామ యనుచు రాముని తలతుము
రామ నామ మొసగు రక్ష మాకు |
రామ జపము భక్తి రాజ్యమ్ము జేర్చును
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

45. సద్గురువుల పథము సద్బుద్ధి నొసగుచూ
నాత్మ జ్ఞాన మిచ్చు నవని యందు |
బుద్ధితోడ సాగి సిద్ధిని పొందుమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

46. మంచు కొండపైన మలయావాసినితోడ
కొలువు దీరె శివుడు వెలుగులిడుచు |
మురిపములతొ కొలువ మోక్ష మొసగు తండ్రి
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

47. బాధ పెట్ట బోకు బాధ్యత నెరుగక
తల్లిదండ్రి మనసు తల్లడిల్లు |
కన్న వారు మనకు కనిపించు దైవమ్ము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

48. పరమశివుని దలచి పరమహంసగ మారె
ఆత్మదీప్తి తోడ అడుగు లిడుచు |
పుణ్య మార్గమందు మోక్షము బొందెను
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

49. మాయ జేసి నీవు మభ్యపెట్టెద వేని
కల్ల బొల్లి మాట కళ్ళు గప్పి |
మనిషి మోస పోవు మధుసూదనుడు కాదు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

50. ఎంత దోచు కొనుచు ఎన్ని దాచిన గాని
వెంటరావు మనకు జంటగాను |
చేయు పుణ్య మేను చివరకు మిగిలేను
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

51. శివుని పుత్రు డాయె శివ తేజమును దాల్చి
పళని లోన వెలసె ఫలము నొసగ |
శరవణ భవు డగుచు శరణార్థులనుగాయు
నవ్య కవన సరణిః నడుచు హరిణి ||

52. కల్పతరువు శక్తి కష్ట సమయ మందు
ఆపదలను గలచి అపర శక్తి |
వారణాసి యందు వారాహియై నిల్చె
నవ్య కవన సరణిః నడుచు హరిణి ||

53. అమ్మ దేహ మొక్క అమృతాలయము
చచ్చి బతికి తాను జన్మనిచ్చు |
కన్న ప్రేమ ఎపుడు కరిగిపోని నిధిరా
నవ్య కవన సరణిః నడుచు హరిణి ||

54. కర్మననుభ వించి కైవల్యమును బొంద
మేను నొసగె నంట వేల్పు మనకు |
తనువు మీద వలదు తగనిదౌ మోహము
నవ్య కవన సరణిః నడుచు హరిణి ||

55. అమ్మ యనుచు తలుప నరుదెంచు వెంటనే
దురితముల నణచును దుర్గ జపము |
దుర్గతులను మాపి దుర్గమై నిలుచును
నవ్య కవన సరణిః నడుచు హరిణి ||

56. ధర్మపథము లోన ధరణి నేలినమూర్తి
తండ్రి మాట కిడెను తగిన విలువ|
వనము కేగి తాను మన మదిన నిలిచె
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

57. ఆప్తులనుచు దలచి ఆధారపడకోయి
కష్టముందు నీకు కలతవలదు |
కలలు సఫల మగును కఠినమౌ కృషి జేయ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

58. నిధుల కన్న ఘనము నీదు విద్య వెలుగు
చీకటింట తొలగు జేయు చింత |
భవ్య భవిత నొసగు భారతి దయచూపి
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

59. సద్గురువుల పథము సద్బుద్ధి నొసగుచూ
నాత్మజ్ఞానమిచ్చు నవనిలోన |
బుద్ధి తోడ సాగి సిద్ధిని పొందుమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

60. ఇతరులందు చూడ నెన్నియో లోపముల్
స్వీయ లోప మనిన చింత రాదు |
ఆత్మ శోధనంబు యజ్ఞ సమానము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

61. బుద్ధి నొసగు టకును బుద్ధుడవతరించె
ధర్మపథము వెడల దారి చూపె |
ఆత్మ జ్ఞానమిడెను అద్భుత బోధతో
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

62. కదిరి యందు వెలసె కాటమరాయుడై
కాలు మోపి నంత కాద్రి (కదిరి) యాయె |
నమ్మి కొలుతు నిన్ను నరమృగ శ్రేష్ఠమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

*__శ్రీ లక్ష్మీ నరసింహ__ దేవాలయం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని శ్రీ సత్యసాయి జిల్లాలోని __కదిరి__లో నెలకొని ఉన్న ఆలయం*

*ఈ దేవాలయం ఎత్తైన ప్రహారీతో, విశాలమైన ఆవరణలో విలసిల్లుతున్నది. ఇది 13 వ శతాబ్దంలో దశలవారీగా అభివృద్ధి చెందిందని శాసనాల వలన తెలుస్తున్నది. ఆలయానికి నాలుగు వైపుల గోపురాలు కలిగి ఉంది. ప్రధాన ఆలయంలో గర్భగుడి, అంతరాలయం, ప్రదిక్షిణా పథం, ముఖ మంటపం, అర్థ మంటపం, రంగమంటపం ఉన్నాయి. రంగ మండపంలో ఉన్న నాలుగు స్తంభాలపై ఉన్న శిల్ప కళా రీతులు అత్యంత సుందరంగా ఉంటాయి. ఇక్కడున్న కోనేరును భృగుతీర్థం అంటారు. ఇక్కడి స్వామివారు అమ్మతల్లి, తాయారు, ప్రహ్లాదులతో కలిసి దర్శనమిస్తారు. ఈ అలయంలో రంగ మండపం పై వేసిన రంగుల బొమ్మలు శతాబ్దాల నాటివి. అందుచేత కొంత వెలిసినట్లున్నా, ఇప్పటికీ బాగున్నాయి. ఈ ఆలయం ముందున్న పెద్ద రాతి ధ్వజస్తంభం నిలబెట్టిన విధానం కొంత ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ధ్వజ స్తంభం పునాదిలో నుండి కాకుండా ఒక బండ పైనే అలా నిలబెట్టి ఉంది*

63. గుణముల నిధి యైన గురుని సాంగత్యము
ఛందములను నేర్పె నందముగను |
శతకమును లికింప సాహసమును జేసి
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

64. భయము వీడి రామ భద్రుని వేడుమా
ప్రాణమందు నిలిపి పరవశమున |
ముదము తోడ కొలువ మోక్షమొసగు స్వామి
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

65. శేష శయన! దేవ! శేషాచల నివాస!
శంకచక్ర ధరుడ శరణ మిడుము
నీదు చరణ సేవ నిత్య భాగ్యము స్వామి
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

66. బావి యందు వెలసి బాహుదా తీరమున్
సర్వ శుభము లిడుచు సాక్షి యగుచు |
వరము లొసగ నిలిచె వరసిద్ధి గణపతి
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

67. మనుషులందు పోవు మనకు విశ్వాసము
మనసు గాయపడిన మరల మరల |
నమ్మకమ్మె మందు నారాయణుడి పైన
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

68. వైభవమున నిలిచె వల్లభ గణపతి
అరుణ వర్ణమందు నలరుచుండు |
రక్షసేయుతా ప్రదక్షిణల్ సేయగా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

69. కాలమెపుడు రాదు కరిగి చేజారిన
వేళ మించ నట్లు వేగిరముగ ।
కష్టపడిన కలలు గాగలవు నిజము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

70. వరములిడ జనులకు వారాహియై నిల్చి
శరణు వేడి నంత శక్తి నొసగు ।
దుష్ట శిక్షణ చేసి దురితములను బాపు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

71. అవతరించె స్వామి అనసూయ కొమరుడై
ధార్మికులకు తెరవు దత్త గురువు ।
ఆత్మ సిద్ధి నొసగు నవదూత రూపమున్
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి॥

72. జనుల కిడును శుభము జగమేలు నాథుడు
పూరి యందు వెలసె పుణ్యమూర్తి ।
పిలిచి నంత పలుకు వేద వేత్తల వేల్పు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

73. అందచంద మెపుడు నలరించు జనులను
మనసు జూడ వేరు మనుజులెవరు ।
అందమైన హృదయ మలరించు ఈశుని
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

74. జిహ్వ చూపు నెపుడు చిలిపిదౌ చపలము
కోరు చుండు మనని కోటి రుచులు |
రామనామపు రుచి ప్రేమగా చూపుమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

75. ముద్దులొలుకు చుండు ముగ్ధమోహన మూర్తి
నెంత పొగిడి చూడ నెలమి లేదు |
నీదు సేవ భాగ్య మిడుమమ్మ వరలక్ష్మి
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

76. జన్మధన్య మాయె చక్రధరుని గాంచి
కాంతులీను చుండె కలికి రూపు |
తనువు కిడుము శక్తి తగిన సేవను జేయ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

77. కొలువు దీరె వేల్పు కోనేటి రాయుడై
నమ్మి కొలుచు వారి నాథుడతడు |
కరుణ జూపి నడుపు కలియుగ దైవమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

78. మధురలోన వెలసె మాయల కృష్ణుడు
నందుడింట పెరిగె నల్లనయ్య |
నడచు నంట వెంట నమ్మిన మనతోడ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ॥

79. చేయు కర్మలెప్పుడు చెరిగిపోవెన్నడున్
మంచి చెడులు తిరిగి మనని జేరు ।
వెంట వచ్చు నన్ని వెన్నంటి మనతోడ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

80. నీవె సత్యమనుచు నిన్నె నిత్యమునమ్మి
నడిచితి నిను చేర నారసింహ ।
మోక్షమొసగు దేవ ముగ్ధ మోహన రూప
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

81. ఈశ్వరేచ్ఛ నడుపు నీచరాచర సృష్టి
ఇల నిమిత్త మాత్రు డీవు నరుడ ।
జరుగు వన్ని జూచి చలియింప బోకుమా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

82. విశ్వమందు నిలుపు విఖ్యాత గానన్ను
విశ్వజనని నీకు విన్న వింతు ।
శతకములను వ్రాసి శాశ్వతముగ నిల్వ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

83. విష్ణు తేజమైన విషధరుడైనను
దైవ మొక్క డన్న తలపు మేలు ।
ముక్తి పొంద గలవు పుణ్య మార్గము నందు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

84. నిగమ నిలయమైన నీరజ నాభుని
భక్తి తోడ నేడు భజన సేతు |
దివ్య చరణములకు భవ్యార్చనల్ జేతు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

85. మనషులందు మనము మనసును నిలిపిన
బంధ నముల జిక్కి బాధ గలుగు |
దైవ పథము బట్టి తరియించు మత్యుడా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ॥

86. తెలుప బిడియ మేల తెలుగువార మనుచు
వెలుగు లిడుచు నిలిచె తెలుగు తల్లి |
మాతృ భాష నెపుడు మమత తోడను గాంచు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

87. భక్తి తోడ వేడ ప్రవహించె గంగమ్మ
పుణ్య నదిగ పొరలె పుడమి యందు |
సద్గతి నిడె తాను సగర కులమునకు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

88. చలము లేని తాను చరవాణిగా మారె
లోకమంత నిలిపె లోగిలందు |
మనిషి తోడ కలిసి మనుగడ సాగించు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

89. విన్నపములు జేతు విఘ్నాది పతి నీకు
విఘ్నములను బాపి విజయ మిడుము |
చెంత నుండి నీవు చేయూత నిడుమయ్య
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

90. ఆణిముత్య మంటి ఆటవెలది మనది
తేనె లొలుకు చుండు తేటగీతి |
ఛంద మెపుడు కూర్చు చక్కని అందము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

91. గూగులన్న పేరు గుండెకు దరిజేరె
ప్రశ్న లెన్ని యైన పలుకునెపుడు |
ఆక్రమించె తాను అనుభవజ్ఞుల గద్దె
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

92. మంచుకొండ పైన మలయ వాసిని తోడ
కొలువు దీరె శివుడు వెలుగులిడుచు |
ముదము తోడ వేడ ముక్కంటి పలుకును
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

93. సాయ మిడును తాను సాయీ యని పిలువ
మమత చూప నిలుచు మానసమున |
సాగు జేయ మనెను శ్రద్ధా సబూరిని
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

94. భద్రగిరిన వెలసె భద్రుడు కోరంగ
కొలుచు వారి మదిన కొలువు దీరు ।
మోక్షమొసగు మనకు రక్షనిడుచునెపుడు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

95. ధర్మ రక్షణ సేయ ధర్మస్థలం బందు
మంజునాధు డగుచు మనని జేరె ।
కొలుచు వారి మదిన కొలువుదీరు నెపుడు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

96. మంచి పనులు సేయ నెంచిన వేళలో
చెడ్డ వారు దారి చెరచు నెపుడు ।
నిలిచిపోక నీవు నిత్యము కొనసాగు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

97. కవన శక్తి నొసగి కవయిత్రిగా జేసి
కరుణ చూపె నంట కలికి రూపు ।
అమరముగ నిలువగ ఆశీస్సు లిడుమయ్య
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

98. అవని భాష లందు ఆంధ్రభాషయె మిన్న
కవుల నెలవు యగుచు కాంతులిడెను ।
ఒక్కసారి పలుక ఒరవడిగా సాగు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

99. పోల్చ వలదునెపుడు పొరుగును నీతోడ
వేయలెక్క లెపుడు వెలితి మిగులు ।
బ్రతుకు సమరమందు బాటలు వేరయా
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

100. హరికి ప్రీతి గాను యవని యందున నేను
హరి హరి యనుచుందు హాయిగాను ।
స్వామి నామ జపము సార్ధక మొసగేను
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

101. భావ ముద్భవించె భారతి దయజాప
పదమునందు విరిసె పరిళమళములు ।
పద్యమాల లన్ని పద భూషణములాయె
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

102. కాళరాత్రి లోన కాంతులీనుచు నీవు
కంటి రెప్ప వోలె కాచు మమ్ము ।
కామి తములు దీర్చ కళ్యాణి వై నీవు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

103. అఖిల లోకములకు నాధారమైతాను
మొదలు తుదులు లేక మోహనముగ।
వెలుగు లిడుచు దుర్గ విజయవాడన నిల్చె
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ।।

104. నలుపు తెలుపులనుచు నందురు జగమున
రంగులన్ని మనకు లింగ డొసగె |
ఛాయ కన్న మిన్న చక్కనైన గుణము
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

105. చివరి కాలమందు చింతింప నేలయా
సమయ ముండ జపము సలుప తగును |
తనువు నిడెను మనకు దైవ సేవను జేయ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||


106. బ్రతుకు నాటకమున పాత్రయౌ మత్యుడు
విస్మరించె నిత్య విధిని తాను |
నటనె నిక్క మనుచు నాథుని మరచెను
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

107. బ్రతుకు విలువ నెరిగి పయనించు మిత్రమా
దురలవాటు కెపుడు దూర ముండు |
చేయి జారు పిదప చింతింప వ్యర్థమౌ
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||

108. శారద దయజూప శతకవైభవమొచ్చె
పద్య పంట విరిసె పసిడి వోలె
కావ్య శోభ లలరె కాంతు లీనుచు నేడు
నవ్య కవన సరణిఁ నడుచు హరిణి ||



## అత్తా మామలు



శ్రీ చొప్పకట్ల శ్రీరామ మూర్తి - సత్య లక్ష్మి

## నా కుటుంబం



హరిణి - శ్రీనివాస శ్రీధర్ - కార్తీక్ రామ - దుర్గ శర్వాణి

# రచయిత్రి పరిచయం

నానమ్మ తాతగారు కీ.శే శ్రీ దుద్యాల సుబ్రహ్మణ్యం గారు, శ్రీమతి సుందరమ్మ గారు మరియు అమ్మమ తాతగారు శ్రీ జనమంచి రామసుబ్రహ్మణ్యం గారు, శ్రీమతి రాధమ్మ గారి పాద పద్మములను స్మరించుకుంటూ నమః సుమాంజలులు.

నేను హైదరాబాదు లో జన్మించి మా నాన్న గారి స్వస్థల మైన మదనపల్లె పట్టణమందు విద్యాబుద్ధులు నేర్చుకున్నాను. ఆ తరువాత ఉన్నత విద్యలను హైదరాబాదు లో అభ్యసించి NTR యూనివర్సిటీ నుంచి ఫిజియో థెరపీలో పట్టభద్రురాలి నయ్యాను. మానవ సేవే మాధవ సేవ యని తలచి వైద్య వృత్తి నెంచుకున్నాను.


మొదటినుంచి నాకు పెయింటింగ్ పెన్సిల్ స్కెచెస్ వేయడం చాల ఇష్టం అలాగే కథలు కవితలు వ్రాయడం కూడా చాలా ఇష్టమైనవి, ఈ మధ్యనే పద్య రచన మీద సాధన చేసి అమ్మవారి కృపతో ఈ శతకాన్ని పూర్తి చేశాను.

నాకు హైదరాబాదు వాస్తవ్యులైన శ్రీనివాస శ్రీధర్ తో వివాహం జరిగినది, మా వారు సాఫ్టు వేరు రంగములో పని చేస్తున్నారు మాకు ఇద్దరు పిల్లలు అబ్బాయి కార్తీక్ రామ్, అమ్మాయి దుర్గ శర్వాణి.

నాకు ఇద్దరు తోబుట్టువులు అక్కయ్య హిమబిందు మరియు అన్నయ్య మంజునాథ్. ఇంటి లో అందరికన్నా చిన్నదాన్ని కావటం వలన నాకు వారి ప్రేమ సహాయ సహకారములను నిత్యం అందిస్తూ నా వెన్నంటే ఉంటారు.

నా పద్య రచనకు తమ వంతు సహాయ సహకారముల నందిస్తూ నిరంతరం నన్ను ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు

- హరిణి



నేను చిత్రించిన చిత్రం